క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన

హుకుంపేట: వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులలో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నివాస ప్రాంతాల్లో నీల్వ నీరు లేకుండా చూసుకోవాలని, డ్రైనేజీలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. జ్వరం, జలుబు తదితర లక్షణాలుంటే తక్షణమే వైద్య సేవలు పొందాలన్నారు.

వలంటీర్లకు నియామకపత్రాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రమేష్, ఎంపీడీవో సీతయ్య తదితరులు

కొయ్యూరు: వలంటీర్లుగా ఎంపికైన వారికి శుక్రవారం ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు నియామక పత్రాలను అందజేశారు. యూ.చీడిపాలెంలో-రెండు బకులూరులో ఒక పోస్టు భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. బకులూరుకు రాజు, యూ.చీడిపాలెనికి చెల్లారావు, విజయలక్ష్మి ఎంపికైనట్టు ఎంపీడీవో సీతయ్య తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మారెమ్మ

చింతపల్లి: మండలంలోని జాజులపాలెం ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి మారెమ్మ శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 140 మందికి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యాధుల సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌వో సౌజన్య, ఏఎన్ఎం నాగరత్నం పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

చింతపల్లి: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం వినాయక చవితి వేడుకలు పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వినాయకుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. స్థానికులతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

వర్షాలతో అప్రమత్తం



సీఐ స్వామినాయుడు

కొయ్యూరు: వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ స్వామినాయుడు సూచించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుండడంతో రామరాజుపాలెం,.పెదమాకవరం ప్రాంతాల్లో గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. గెడ్డలు దాటేందుకు ఎవరూ సాహసాలు చేయవద్దని సూచించారు. కొయ్యూరు నుంచి బూదరాళ్ల మీదుగా చాపరాతిపాలెం చింతపల్లి వెళ్లే వారు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదనీరు తగ్గిన తరువాత వాహనాల రాకపోకలు సాగించాలని సూచించారు.

సర్కారు బడుల్లో డిజిటల్ చదువులు

- కార్పొరేట్‌కు దీటుగా కేజీబీవీ పాఠశాలలు
- విద్యార్థినులకు ట్యాబ్‌లు
- ఆనందంలో విద్యార్థుల తల్లిదండ్రులు



ట్యాబ్‌లతో విద్యార్థినిలు



కేజీబీవీలో డిజిటల్ పాఠాల బోధన

అనంతగిరి: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా మారుస్తోంది. నాడు-నేడు ద్వారా అధునాతన సదుపాయాలు కల్పిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి.ఉన్నత బోధన, మెరుగైన సదుపాయాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ఫలితంగా ఏటా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నాయి. దీంతో పాటు సర్కారు పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇది మెరుగైన ఫలితాలు ఇస్తుండడంతో సర్కారుబడులన్నింటిలో డిజిటల్ తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

నూరుశాతం ఉత్తీర్ణ ఫలితాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 కస్తూర్బా గాంధీ విద్యాలయాలున్నాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వం విద్యనందించాలని సదుద్దేశంతో అన్ని సౌకర్యాలను ఈ విద్యాలయాల్లో కల్పిస్తున్నారు. దీంతో ఏటా ప్రవేశాలు సంఖ్య పెరుగుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం విద్యకు ఎవరు దూరంగా కాకూదనే లక్ష్యంతో డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి సారించి, సిబ్బందిని గ్రామాలకు పంపించి, విద్యార్థినిలను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. నాణ్యమైన వసతులతో మెరుగైన విద్యను అందించే లక్ష్యంగా పాఠశాలలు పనిచేస్తున్నాయి. పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణ ఫలితాలు సాధించాయి. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 40 సీట్లు కేటాయించారు.

జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు, విద్యార్థినిల వివరాలు

కేజీబీవీలు	విద్యార్థినిలు	కొయ్యూరు	246
అనంతగిరి	230	కూనవరం	270
అరకులోయ	274	మారేడుమిల్లి	273
చింతపల్లి	262	ముంచంగిపుట్టు	267
చింతూరు	251	పాడేరు	271
డుంబ్రిగుడ	258	పెదబయలు	280
జి.కె.వీధి	277	రంపచోడవరం	270
జి.మాడుగుల	269	వి.ఆర్.పురం	223
గంగవరం	273	వై.రామవరం	122
హుకుంపేట	272	ఎటపాక	258

విద్యార్థుల భవితకు నాంది

జిల్లాలోని 19 కేజీబీవీ పాఠశాలల్లో 4,846 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. విద్యార్థినిలతో పాఠశాలలు సందడిగా మారాయి. గతంలోని సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థినిలు కేజీబీవీల్లో చేరేందుకు ఆసక్తి చూపేవారు కారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో సర్కారు పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, డిజిటల్ తరగతులు, నాణ్యమైన మెనూ అమలు చేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చేరేందుకు విద్యార్థినిలు ఆసక్తిచూపుతున్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి, విద్యార్థినిల భవితకు నాందిపలికారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద మారెడుమిల్లి కేజీబీవీ పాఠశాలను సెలక్ట్ చేశారు. 8వ తరగతి విద్యార్థినిలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

బాలిక విద్యకు ప్రోత్సహం

"బాలిక విద్యకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విద్యార్థినిలు ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎంలు ఉన్నారు. ఉన్నత విద్యా బోధన, ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. యోగాసనాలు, ఆటలు వంటివి పీఈటీలు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు కేజీబీవీ పాఠశాలలను పర్యవేక్షిస్తున్నాం.

– సూర్యకుమారి, జీసీడీవో

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

అరకులోయ రూరల్: మండలంలో గన్నెల పంచాయతీ కేంద్రంలో సచివాలయం కన్వీనర్లు హరి, మజ్జి గురు ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీకి చెందిన 4వ వార్డు సభ్యుడు సరభ రాము, 3వ వార్డు సభ్యుడు గొల్లోరి అర్జున్, 2వ వార్డు సభ్యురాలు సర్జవతితో పాటు 50 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వారికి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకతీతంగా ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. పార్టీ కోసం పనిచేస్తే తగిన గురింపు ఉంటుదన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఎంపీపీ ఉషారాణి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లలితకుమారి, సర్పంచ్ బొజ్జ, నాయకులు సాంబ, రంజిత్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, నాయకులు గోపాల్, నర్సింగ్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీట్ ఆఫీసర్ మృతి



మాణిక్యం(ఫైల్)

అరకులోయ రూరల్: అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న దురియా మాణి క్యం శుక్రవారం మృతి చెందారు. అరకులోయ సీ-కాలనీలో నివాసముంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు మాణిక్యం మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు

చింతపల్లి రూరల్: మండలంలో చౌడుపల్లి పంచాయతీ చౌటుపాడులో ఎంపీ నిధులతో బోర్‌వెల్ నిర్మాణానికి శుక్రవారం ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సమస్యను గుర్తించి పలు గ్రామాల్లో బోర్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి గ్రామస్తులతో కలిపి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి, కన్వీనర్ రాజారావు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నేతలు

కొయ్యూరు: మండలంలోని నడింపాలెంలో రూ.ఐదు లక్షల ఎంపీ మాధవి నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి (సామాజిక భవనానికి) శుక్రవారం శరభన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ, ఎంపీటీసీ లోకుల సోమాగాంధీతో కలిసి నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో సామాజిక భవనం కోసం అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని విన్నవించామని స్థానికులు తెలిపారు. ఆమె స్పందించి నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారంతా ఎంపీకీ కృతజ్ఞతలు తెలిపారు. బట్టపనుకుల సర్పంచ్ బాలకృష్ణ, నేతలు సాంబశివరావు, రామారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని గన్నెల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పంచాయతీలో 92 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, సమస్యలను అడిగ తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా ఏ ఒక్క లబ్ధిదారులు ఉండ కూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నామన్నారు. ఈ మేరకు సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఇంటింటికి పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సదుపాయాలు, ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ బొజ్జ, ఎంపీటీసీ సభ్యురాలు లలితకుమారి, తహసీల్దార్ వేణుగోపాల్, నాయకులు సాంబ, రంజిత్‌కుమార్, హరి, గురు, నర్సింగ్, హస్తినకుమార్, లక్ష్మణ్‌కుమార్, గాసి, సంపత్‌కుమార్, గోపాల్, సచివాలయం కార్యదర్శి రాజేంద్ర, డీఏ కృష్ణసోన్నాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని 80 గడపలను ఆయన సందర్శించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను అందజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



చింతపపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లిరూరల్: చింతపల్లిలో సుమారు నాలుగు గంటల సేపు భారీ వర్షం కురిసింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంతసేపు విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై పడిన కొండ చరియలను తొలగించే పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల గమ్యం కుదించినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో కోరాపుట్ వరకే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ శని, ఆది, సోమవారాల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం- కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ శని, ఆది, సోమవారాల్లో విశాఖపట్నం నుంచి బయలుదేరి అరకు వరకు నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ శని, ఆది, సోమవారాల్లో అరకు నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ ఈ.శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఇటీవల జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో రంపచోడవరం గురుకుల కళాశాల విద్యార్థులు అరవింద్, సాగర్, పవన్‌లు, అథ్లెటిక్ విభాగంలో 800 మీటర్ల రన్నింగ్‌లో అఖిల్, 400 మీటర్లు రన్నింగ్‌లో అరవింద్, క్రికెట్ విభాగంలో అఖిల్‌లు ఉత్తమ ప్రతిభచాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కాంతిరోజ్ పీడీ లోవరాజు, సూపరింటెండెంట్ హరి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

పాఠశాలల్లో పంచ ప్రాణ ప్రతిజ్ఞ



లక్కొండ గిరిజన ప్రాథమిక పాఠశాలలో పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గంగవరం : మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులచే పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. శుక్రవారం అన్ని పాఠశాలల్లో ఈ పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రతిజ్ఞలో భాగంగా ..అభివృద్ధి చెందిన భారతదేశంలో నా పాత్రను నేను సక్రమంగా నిర్వహిస్తానని..నాలో ఉన్న వలసవాద మనస్తత్వాన్ని తొలగిస్తానని.. సుసంపన్నమైన భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో అభివృద్ధి చేయడంలో ఎంతో గర్వపడతానని..నా దేశం యొక్క ఐక్యత కోసం సంఘీభావం ప్రకటించుటకు నిరంతరం కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. దీంతో పాటు నా దేశం పట్ల నాకున్న విధులను బాధ్యతలను నెరవేరుస్తానని.. మన దేశం కోసం ధైర్యంగా ప్రాణాలు వొదిన త్యాగధనులను గౌరవిస్తానని..దేశ సంరక్షణ పురోగతికి స్వయంగా అంకితం అవుతానని అంటూ బాలబాలికలు ప్రతిజ్ఞ చేశారు.

శ్రమదానంతో కల్వర్టుకు మరమ్మతులు



బొడ్డాపుట్టు మార్గంలో శ్రమదానంతో కల్వర్టు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామం వద్ద గల గెడ్డపై పైపు కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామస్తులు శ్రమదానంతో కల్వర్టు పునరుద్ధరణ పనులు చేపట్టారు. అగస్టు 1న కురిసిన భారీ వర్షాలకు బొడ్డాపుట్టు మార్గంలో పైపు కల్వర్టు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతోవాహన, రాకపోకలు ఇబ్బందికరంగా ఉండడంతో గ్రామస్తులందరూ కలిసి శ్రమదానంతో మట్టితో దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం బొడ్డాపట్టు-నుర్మతి, మద్దిగరువు గ్రామాల మధ్య వాహన రాకపోకలు సాగుతున్నాయి. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బొడ్డాపుట్టు కల్వర్టుకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



జి.మాడుగులలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



జడ్డంగి- గొబ్బిలమడుగు మధ్య రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ చంద్రుడు తదితరులు

జి.మాడుగుల: మండలంలోని పువ్వులదొడ్డి నుంచి వయ్యారిమామిడి, పాసెలి గ్రామాలకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, చిన్నారావు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఆయా గ్రామాలకు బిటీ రోడ్డు నిర్మాణానికి రూ.80లక్షల నిధులు మంజూరైనట్టు చెప్పారు. దీనిపై గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. సచివాలయ మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం, సచివాలయ కన్వీనర్ మహేష్‌బాబు, మాజీ సర్పంచ్ కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, గృహసారథులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జడ్డంగి నుంచి గొబ్బిలమడుగు వెల్లే మార్గంలో సుమారు పదేళ్లుగా నిలిచిపోయిన ఘాట్ రోడ్డు పనులు శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. సుమారు 1.5 కిలోమీటర్ల పొడవు గల ఈ రహదార అనేక ఏళ్లుగా అసంపూర్తిగా నిలచిపోయింది. కాగా ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.5 కోట్లు నిధులు విడుదల చేయగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు ఇటీవల భూమి పూజ చేశారు. కాగా సర్పంచ్ సవిరెల చంద్రుడు రోడ్డు పనులకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



జి.కె.వీధిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి అచ్యుత్

అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు పంచాయతీ సచివాలయం-2 పరిధిలో కంతభంసుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో మోహనాపురంలో శనివారం నిర్వహిస్తున్నట్టు గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు భావన, సాయిరతన్ చెప్పారు. మండలంలో నేటి నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు నిర్వహించే శిబిరాలను తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసులు బృందాలు పర్యవేక్షిస్తారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30న-మోహనాపురం ఆశ్రమ పాఠశాల ఆవరణలో ,అక్టోబర్3న-జగ్గంపాలెం,4న-జడేరు, 5న- కొత్తాడ, 6న -పెదగార్లపాడులో, 7న-మొల్లేరులో , 9న-మర్రిపాలెంలో, 10న-నెల్లిపూడిలో వైద్య శిబిరాలు జరుగుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ అచ్యుత్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలి రోగులకు టోకెన్‌లు పంపిణీ చేయాలన్నారు. వారిని ఆరోగ్య సురక్ష శిబిరాలకు తీసుకురావాలని ఆయన కోరారు. వచ్చే నెల 7న రింతాడ-2లో , 9న-దుశ్శరిపాలెం, 13న దేవరాపల్లి, 16న రింతాడ-1- సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జి.మాడుగుల: మండలంలో అక్టోబర్ 3 నుంచి 27 వరకు రెండు వైద్య బృందాలతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 3న-కె.కోడాపల్లిలో, 4న పాలమామిడిలో, 5న సొలభంలో, 7న జి.మాడుగులలో 9న- భీరంలో, 10న నుర్మతిలో, 12న వంతాలలో, 13న పెదలోచలిలో, 16న గడుతూరులో, 18న సొలభంలో, 19న కోరాపల్లిలో, 20న పెదలువ్వాసింగిలో 21న సింగర్భలో, 25న బొయితిలో, 26, 27న వంజరిలో వైద్య శిబిరాలు నిర్వహించునున్నట్టు పేర్కొన్నారు. ఆయా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ విలీన గ్రామం కేఎన్‌ఆర్ పేట శ్రీ సీతారామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఉచిత సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం శుక్రవారం నిర్వహించారు. విశాఖ జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 30 మంది దంపతులు స్వామివారి వ్రతంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద వితరణ జరిగింది. అధిక సంఖ్యలె భక్తులు పాల్గొన్నారు.